3.60 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లాలో 19 ఏళ్లలోపు ఉన్న సుమారు 3.60 లక్షల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డిఎంహెచ్ఒ జీవనరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్బెండజోల్ మాత్ర మధ్యాహ్నం భోజనం తర్వాత అందిస్తారని, ఇది నమిలి మింగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చే తమ పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్ర ఇప్పించాలని సూచించారు. గుర్ల మండలంలో ఫైలేరియా వ్యాధిని నియంత్రించడానికి సోమవారం నుంచి ఈ నెల 27 వరకు మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

నాడు ఓడ మల్లన్న.. నేడు బోడి మల్లన్న

ఒడ్డుకు చేరే వరకు ఓడ మల్లన్నా.. అంటూ బతిమాలిన ఓ వ్యక్తి తీరా ఒడ్డుకు చేరాక బోడి మల్లన్నా... అంటూ హేళన చేశాడట. మత్స్యకారుల విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఇందుకు అద్దం పడుతోంది. తాము అధికారంలోకి వస్తే మత్స్యకారులను ఉద్ధరిస్తామంటూ తెగ హామీలు గుప్పించిన సిఎం చంద్రబాబు గాని, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గానీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు. ఎన్నికల హామీలే కాదు... సముద్రంలోని వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు కొన్ని దశాబ్దాలుగా అందించే జీవన భృతిని కూడా చెల్లించలేదు. దీంతో మత్స్యకారులు ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరాశ, ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మత్స్యకారులకు అందని జీవన భృతి
- రీసర్వే ముగిసినా స్పందించని ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం తీరంలో వందలాది కుటుంబాలు సముద్రవేట ఆధారంగా జీవనం సాగిస్తున్నాయి. సంప్రదాయ, మోటార్ బోట్లు, తెప్పలతో మత్స్యకారులు చేపలవేట సాగిస్తారు. తద్వారా తీరానికి చేర్చిన మత్స్య సంపద ద్వారా వచ్చిన డబ్బులతో ఏ రోజుకారోజు సరుకులు కొనుక్కుని జీవన పోరాటం సాగించేవారే అధికం. ప్రభుత్వం కూడా ఈ మత్స్య సంపద క్రయ, విక్రయాల ద్వారా ఏటా రూ.కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. సముద్రంలో వివిధ రకాల చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో సముద్రంలో యాంత్రిక పడవలు, మెకనైజ్డ్ మోటారు బోట్ల ద్వారా చేపట్టే అన్ని రకాల చేపల వేటను ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సాక్షాత్తూ ప్రభుత్వం నిషేధిస్తున్న విషయం తెలిసిందే. వేట నిషేధ సమయం 61 రోజులకు గాను గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రూ.10 వేల చొప్పున జీవన భృతి చెల్లించేది. దీన్ని కొనసాగించడంతోపాటు మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుంటామని, వైసిపి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించిందని అటు టిడిపి, ఇటు జనసేన అధినేతలు నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చాక రీసర్వే పేరిట కొత్త పల్లవి అందుకుంటూ అర్హతకు అనేక ఆంక్షలు పెట్టారు. చివరికి రీసర్వే పేరట సాగదీత ఇప్పటికీ వీడలేదు. 2024 మార్చి 31 నాటికి 18 ఏళ్లపైబడి 60ఏళ్ల లోపు వారు.. సుమారు 3789 మంది ఉన్నారు. వీరందరికీ జీవన భృతి చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

ప్రభుత్వ మార్గదర్శకాలు

జీవనభృతి పొందాలంటే ప్రభుత్వం మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి. ఆదాయపు పన్ను చెల్లించేవారు అనర్హులు. మత్స్యకార పింఛను, లేదా ఇతర సామాజిక పింఛను పొందినవారు, ఉద్యోగ విరమణ అనంతరం పింఛను పొందిన వారూ అనర్హులే. లబ్ధిదారు కుటుంబ సంవత్సర ఆదాయం గామీణ ప్రాంతాల్లో అయితే రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలకు మించకూడదు. అందులోనూ పల్లం భూమి 3 ఎకరాలు, మెట్టు భూమి 10 ఎకరాలకు మించి ఉండకూడదని మెలికపెట్టారు. లబ్ధిదారుని పేరు మీద గాని, లేదా వారి కుటుంబ సభ్యుల పేరు మీద నాలుగు చక్రాల వాహనం రిజిస్టరై ఉంటే జీవన భృతి అవకాశం లేదు. గృహావసరాలకు వాడుతున్న విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు దాటినా అంతే సంగతి. పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులు మించిన ఖాళీ స్థలం ఉన్నా, ఏ ఒక్కరూ ప్రభుత్వ లేక ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగస్తులైనా అవకాశం వదులుకోవాల్సిందే. ఈ నిబంధనలకు అనుగుణంగా గడిచిన మే నెలలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేపట్టారు. 2023 సెప్టెంబర్ 14వ తేదీ నాటికి రిజిస్టర్ అయిన లైసెన్స్ కలిగి ఉన్న మోటార్ బోటు, మోటారు లేని సంప్రదాయ తెప్పల యజమానులు, వాటిలో పనిచేసే వారిని గడిచిన మే నెలలో చేసిన సర్వేలో అధికారులు గుర్తించారు. అప్పటికీ జీవన భృతి మాత్రం చెల్లించలేదు. మరో దఫా వేట నిషేధ సమయం కూడా ముంచుకొస్తుండడంతో వేటపై ఆధారపడిన మత్స్యకార కుటుంబాలకు ఎలా జీవనం నెట్టుకురావాలో అర్థం కాని పరిస్థితి ఎదురౌతోంది. ఓట్లేస్తే తమను ఆదుకుంటామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నామంటూ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేట నిషేధ భృతి రూ.40 వేలు ఒకేసారి ఇవ్వాలి

గత ఏడాది భృతి రూ.20 వేలు ఈ ఏడాది వేట నిషేధ సమయం ముందు ఇస్తామని ప్రభుత్వం చెబుతుంది. వేట నిషేధ భృతి గతేడాది, వస్తున్న ఏడాది కలిపి రూ.40 వేలు వేట నిషేధానికి ముందే ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరుస తుపాన్లతో ఇబ్బంది పడుతున్న మత్స్యకారులకు రెండేళ్లది కలిపి ఈ ఏడాది నాలుగో నెలలో వేట నిషేధ సమయానికి ముందు వేట నిషేధభృతి ఇచ్చి ఆదుకోవాలి.

– బర్రి చిన్నప్పన్న,
జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి



మాట్లాడుతున్న పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-బొబ్బిలి

తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి తెలిపారు. ఆదివారం బొబ్బిలి పట్టణంలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. మూడు దశాబ్దాల నుంచి విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తున్నాన న్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి యూనివర్సిటీ వరకు విద్యారంగ, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్ల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఇప్పటికే ఆయా సమస్యల పరిష్కారానికి పోరాటం చేశానని, ఎమ్మెల్సీగా గెలిపిస్తే మండలిలో గళం వినిపిస్తానని చెప్పారు. ప్రయివేట్ విద్యాసంస్థలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లకు సంక్షేమ నిధి కేటాయించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేసి రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషిచేస్తానన్నారు. పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆమె ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లను కోరారు. ఆమెతో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు ఉన్నారు.

డిమాండ్ల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్, 104 ఉద్యోగులు

104 ఉద్యోగులకు న్యాయం చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్ఇపిలో సవరణ చేసి 104 ఉద్యోగులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన 104 ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 104 డ్రైవర్లు, డిఇఒలు.. ప్రజలకు సేవ చేస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్నారన్నారు. కొత్తగా తయారుచేసిన ఆర్ఇపిలో డిఇఒలకు జీతభత్యాల విషయంలో ఎటువంటి మార్పూ జరగలేదన్నారు. స్లాబ్, పిఎఫ్, ఇఎస్ఐ విషయంలో స్పష్టత లేదన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. 104 డ్రైవర్లు, డిఇఒలకు స్లాబ్ అమలు చేయాలని, ఇది ఆటోమేటిక్‌గా అమలయ్యేలా ఆర్ఇపిలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. 104లో సిటివి విధానాన్ని రద్దు చేసి, ఇపిఎఫ్‌లో యాజమాన్యం వాటా యాజమానే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్ఇపిలో ఇఎస్ఐ పొందుపరచాలన్నారు. 104 ఉద్యోగులకు వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, ప్రభుత్వ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో 104 ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు రామరాజు, జగన్మోహన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సర్వే చేస్తున్న సిబ్బంది

గుణుపూరుపేట డంపింగ్ యార్డులో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్త ఎంత ఉందన్న విషయమై డ్రోన్ సర్వే చేపడుతున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో గుణుపూరుపేటలో ఉన్న చెత్త వివరాలను సేకరించేందుకు ఆదివారం డ్రోన్ సర్వే చేపట్టారు. వాస్తవానికి నగరం నుంచి చెత్తను ఎప్పటికప్పుడు 95 శాతం వరకు మధురవాడలో ఉన్న గ్రీన్ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. మిగిలిన ఐదు శాతం మట్టి, కొమ్మలు మాత్రమే గుణుపూరుపేటలో ఉన్నాయి. అయితే గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్త ఎంత ఉన్నది అన్న విషయమై అధ్యయనం చేసే నిమిత్తం డ్రోన్ సర్వే చేపడుతున్నారు. మిగిలి ఉన్న చెత్తను కూడా వంద శాతం ప్రక్షాళన చేసే దిశగా ప్రయత్నిస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. 2022 నుంచి చెత్తను ఏ రోజుకారోజు గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కు తరలిస్తున్నట్లు చెప్పారు.

ప్రధాన కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చాలాకాలంగా ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ఆదివారం కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది తొలగించారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద ఉన్న ప్రధాన కాలువలో జెసిబి సహాయంతో పూడికతీత పనులు చేపట్టారు. ఈ పనులను కమిషనర్ పల్లి నల్లనయ్య పరిశీలించారు.

కాలువలో పూడిక తీస్తున్న జెసిబి

'ప్రజ్ఞా వికాసం' విజయవంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్ష విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం మోడల్ టెస్ట్ నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ప్రశ్నపత్రాలను వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న పబ్లిక్ పరీక్ష కోసం విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. రామ్మోహన్ మాట్లాడుతూ మొదటిసారి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇది ఒక మోడల్ ఎగ్జామ్‌గా ఉంటుందని, విద్యార్థుల్లో ఉండే భయాన్ని పోగొడుతుందని తెలిపారు. సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రజ్ఞా వికాస పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి రూ.5 వేలు, 3 వేలు, 2 వేలు చొప్పున నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము, సహాయ కార్యదర్శి రవి, జిల్లా నాయకులు రాజు, సూరిబాబు, సమీరా, జయ, ఎర్రమ్మ పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజ్ఞా వికాసం ప్రశ్నాపత్రాలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు, జిల్లా సహాయ కార్యదర్శి కె.మణికుమార్, బొబ్బిలి మండల కార్యదర్శి కేశవ, మండల సహాయ కార్యదర్శి జానీ, మండల నాయకులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్ష పేపర్‌ను యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. వెంకటరావు ఆవిష్కరించారు. ఈ ప్రజ్ఞ

ప్రజ్ఞా వికాసం ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న సిఐ శ్రీనివాస్

వికాస పరీక్షలలో అన్ని పాఠశాలలకు చెందిన 290 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఏ.అను, మండల గర్ల్స్ కో కన్వీనర్ రత్న, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె రమేష్, మండల కమిటీ సభ్యులు వి.చరణ్, రవి, శీల, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పేరుతో మోడల్ టెస్ట్ నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ప్రశ్నాపత్రాలను జిల్లా ఉపాధ్యక్షులు పి.రమేష్, జిల్లా కమిటీ కోగర్ల్ కన్వీనర్ బి.రూప చేతుల మీదుగా ఆవిష్కరించారు.

మామిడికి మంచు దెబ్బ

- దట్టంగా కురుస్తున్న పొగ మంచు
- రాలిపోతున్న పూత, పిందెలు
- ఆందోళనలో రైతులు

మామిడి, జీడికి మంచు దెబ్బ తగులుతోంది. కొద్దిరోజులుగా దట్టంగా కురుస్తున్న మంచుతో పూత మాడిపోతోంది. సాధారణంగా మామిడి పంటకు డిసెంబరు, జనవరి నెలల్లో పూత వస్తుంది. ఈ ఏడాది ఆరంభం నుంచీ తీవ్రమైన పొగ మంచు కురియడంతో పూత మసిబారి నాశనం అవుతోంది. దీంతో ఈ ఏడాది పూర్తిగా పంట నష్టపోవాల్సి వస్తుంది రైతులు ఆందోళన చెందుతున్నారు.

మాడిపోతున్న మామిడి పూత

ప్రజాశక్తి - చీపురుపల్లి

జిల్లాలో చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా మామిడి తోటలున్నాయి. వేల సంఖ్యలో రైతులు వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నియోజకవర్గంలో 22,467 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. మెరకముడిదాం మండలంలో 10,357 ఎకరాలు, చీపురుపల్లి మండలంలో 3,014 ఎకరాలు, గరివిడి మండలంలో 4,965 ఎకరాలు, గుర్ల మండలంలో 4,311 ఎకరాల మామిడి తోటలు ఉన్నాయి. సాధారణంగా నవంబరు నుంచి జనవరి వరకూ మామిడి పూత వస్తుంది. ప్రస్తుతం రసాలు, పనుకులు, సువర్ణరేఖ రకాలకు సంబంధించి పూత పూసింది. మరికొన్ని రకాలు పూతకు వచ్చే దశలో ఉన్నాయి. గతేడాది డిసెంబర్‌లో వర్షాల కారణంగా కొంత పూత రాలిపోయింది. పూత రాని చెట్లు సైతం మరింత ఆలస్యం అవుతుండడంతో రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. ఇటీవల కాలంలో కురుస్తున్న మంచు ప్రభావంతో పూత మాడిపోయి నేలరాలి పోతోంది. దట్టమైన మంచు ప్రభావంతో కొన్నిచోట్ల చిన్నచిన్న మామిడి పిందెలు సైతం నేల రాలిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచి అధికంగా కురుస్తున్న మంచుతోపాటు పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో మామిడి పూత, పిందెల పైన తామర పురుగు ఆశిస్తోంది. దీంతోపాటు తెగులు సోకి మామిడి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యాన శాఖాధికారుల సూచనలు

మంచు ప్రభావంతో మామిడి తోటలను తెగుళ్ల బెడద వెంటాడుతోంది. వీటి నివారణకు దయామేదాక్షమ్ 0.5 గ్రాములు, హెక్సాకోనోజోల్ 2 మిల్లీమీటర్లు కలిపి తెగులు సోకిన మామిడి పూత పై పిచికారీ చేయాలని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. మామిడి పిందెలను నాశనం చేసే చల్లని పచ్చని పురుగు మామిడి తోటలపై అధికంగా సోకే ప్రమాదం ఉంది. వాటి నివారణకు దయా మేదాక్షమ్, హెక్సాకోనోజోల్‌తోపాటు ఇమామాక్సిన్, బెంజోయేట్ 0.5 మిల్లీమీటర్లు.. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మామిడి పిందెలు పూర్తిస్థాయిలో నిలబడటానికి ఫినోఫిక్స్ 44 గ్రాములు, బోరోన్ 88 గ్రాములు పొడరు 200 లీటర్ల నీటిలో కలిపి మామిడి తోటలపై పిచికారీ చేయాలని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. మంచు ప్రభావం నుంచి మామిడి తోటలను రక్షించుకునేందుకు రైతులు సమీప ఉద్యాన శాఖ అధికారులు సంప్రదించాలని సూచిస్తున్నారు.

66 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

- 19 వరకు ప్రాక్టికల్స్
- మార్చి 1 నుంచి 15 వరకు పబ్లిక్ పరీక్షలు
- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి
- 'ప్రజాశక్తి'తో ఆర్ఐఒ ఆదినారాయణ ముఖాముఖి

'ఈ నెల ఐదో తేది నుంచి 19 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నాం. మార్చి ఒకటో తేది నుంచి 15 వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. 66 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా చర్యలు తీసుకుంటా'మని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఒ) ఎం.ఆదినారాయణ తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లు, విద్యార్థుల సన్నద్ధత, తదితర విషయాలను ఆయన వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం టౌన్

ఈ ఏడాది ఎంతమంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారు.?

జిల్లాలో 177 ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ద్వారా మొదటి సంవత్సరం 20,902 మంది, ద్వితీయ సంవత్సరం 20,368 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 5 తేది నుంచి 19 వరకు ఒకేషనల్‌కు, 10 తేది నుంచి 19 వరకు ఎంపిసి, బైపిసి విద్యార్థులకు జరగనున్నాయి. ఒకేషనల్ మొదటి ఏడాది విద్యార్థులు 2836 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 3192 మంది, ఎంపిసి విద్యార్థులు 11414 మంది, బైపిసి విద్యార్థులు 4465 మంది రాయనున్నారు.

పబ్లిక్ పరీక్షలు ఎప్పటి నుంచి? ఎన్ని కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు.?

ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటో తేది నుంచి 15 తేది వరకు జిల్లాలో 66 కేంద్రాల్లో జరగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల్లో వెలుతురు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్తు వంటి సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం.

హాల్ టిక్కెట్లు ఎలా ఇవ్వనున్నారు.?

హాల్ టిక్కెట్లు అన్ని కాలేజీల్లో అందుబాటులో ఉంటాయి. ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వం విద్యార్థి ఫోన్ నంబర్‌కు హాల్ టికెట్ పంపిస్తుంది. విద్యార్థులు ఇచ్చిన ఫోన్ నెంబర్‌లో హాల్ టికెట్ తీసుకునే అవకాశం కల్పించింది.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన ఫలితాల కోసం తీసుకున్న చర్యలు ఏమిటి.?

జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ కళాశాలల్లో 80 శాతానికి పైగా ఫలితాలు సాధించాలని లక్ష్యం. ఇప్పటికే అన్ని కళాశాలల్లో సిలబస్ పూర్తి చేయడంతోపాటు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాం. మెరుగైన ఫలితాల కోసం ఉదయం, సాయంత్రం గంట అదనంగా తరగతులు నిర్వహించి, చదివిస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చిన స్టడీ మెటీరియల్ అందించాం. ప్రీ ఫైనల్ పరీక్షలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

పరీక్షల కోసం ఎంత మంది సిబ్బందిని నియమించారు.?

66 కేంద్రాల్లో జరిగే ఇంటర్ పరీక్షకు మొత్తం 1250 మంది సిబ్బందిని నియమించాం. వీరితో పాటు 3 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 5 సిట్టింగ్ స్క్వాడ్లు, హై పవర్ కమిటీ ఏర్పాటుచేశాం. పరీక్షల విధులు నిర్వహించే ఉద్యోగులు ఎవరూ సెల్‌ఫోన్, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించడానికి అనుమతి లేదు.

పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి.?

పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని శాఖల సహకారం తీసుకున్నాం. ఆర్‌టిసి, విద్యుత్తు, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ సహకారం తీసుకుంటున్నాం. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. విద్యార్థులు సైతం ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు తీసుకొస్తే పరీక్షకు అనుమతించడం కుదరదు. కేవలం పెన్, అట్ట, హాల్ టికెట్ మాత్రమే విద్యార్థులు వెంట తెచ్చుకోవాలి.

విద్యార్థులకు 'ప్రత్యేక' ఇక్కట్లు

● పాఠశాల ఆవరణలోనే పశువుల పాక ●అపారిశుధ్యం మధ్య చదువులు ● రోగాలు బారిన విద్యార్థులు ● ప్రహరీ లేక పాఠశాలకు రక్షణ కరువు

ప్రజాశక్తి- మెంటాడ

పాఠశాల ఆవరణలు పరిశుభ్రతతో పాటు ఆట స్థలం వుంటే ఆ పాఠశాల విద్యార్థుల విద్యాభ్యాసంతో పాటు ఆరోగ్యం పరిశుభ్రంగా ఉంటుంది. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత వున్నా వాతావరణం బాగోకపోయినా అక్కడ విద్యార్థుల చదువులతో పాటు ఆరోగ్యం కూడా దెబ్బ తింటుంది. కచ్చితంగా అలాంటి కోవకు చెందినదే మెంటాడ ప్రత్యేక ప్రాథమిక పాఠశాల. ఈ స్కూలు ఆవరణను ఒక వ్యక్తి కబ్జా చేసి దర్జాగా పశువుల పాకలను వేసుకుని పశువులను కడుతున్నా అతనిపై ఎటువంటి చర్యలూ తీసుకోకపోగా పిల్లలను అక్కడే చదివిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో హెచ్ఎంలు పలుమార్లు అక్రమదారుడిపై ఫిర్యాదు చేసినా మాకెందుకలే అన్న ధోరణిలో వ్యవహరించడం శోచనీయం. పాఠశాలకు ప్రహరీ లేక రక్షణ లేకుండా పోయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలో సుమారు 30ఏళ్ల క్రితం ప్రత్యేక పాఠశాల వుండాలనే ఉద్దేశ్యంతో ముప్పిడి కుటుంబ సభ్యులు స్థలాన్ని పాఠశాల నిర్మాణానికి వితరణ చేశారు. అయితే ఇటీవల

పాఠశాల ఆవరణలో నిర్మించిన పశువుల పాక

అదే స్థలంలో ఆ కుటుంబ సభ్యుడు అక్రమంగా పశువుల పాక నిర్మించుకొని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. అడిగిన విద్యార్థుల తల్లిదండ్రులను, వీధిలో వున్నవారిని అసభ్య పదజాలంతో అక్రమదారుడు తిడుతున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పశువులపాక వల్ల అపారిశుధ్యం, పశువులు ఎప్పుడు విద్యార్థులపై దాడికి పాల్పడుతాయో తెలియక బిక్కుబిక్కుమంటూ రోజులు గడుపుతున్నారు. మెంటాడ రెగ్యులర్, ఎస్సి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు తక్కువ వుండడంతో మెంటాడ నడిబొడ్డులో వున్న స్పెషల్ స్కూల్‌లో పిల్లలను కలపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ తరుణంలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. అయినప్పటికీ ఆట స్థలం లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

పత్రాలపై అనుమానాలు?

పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని దాత వితరణ చేయాలంటే వాటికి సంబంధించిన పత్రాలు, స్కూల్ పేరుపై రిజిస్ట్రేషన్ చేసి, వాటి స్కెచ్‌ను పాఠశాల యాజమాన్యానికి, సబంధిత అధికారులకు అందజేయాలి. అనంతరం పాఠశాల భవన నిర్మాణాలు జరుగుతాయి. కానీ ఇక్కడ ఆపరిస్థితి ఉందో లేదో అర్థం కావడం లేదు. పాఠశాలకు సంబందించిన స్కెచ్, వితరణ చేసిన రిజిస్ట్రేషన్ పత్రాల నఖళ్లను అడిగినప్పుడు సంబందిత అధికారి సమాధానం దాటవేసే పరిస్థితి కనిపిస్తోంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా అక్రమదారునుకు మద్దతుగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన విద్యార్థులు ఇక్కట్లను దృష్టిలో ఉంచుకొని, రోగాలు బారిన పడకముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

ఒత్తిడిని అధిగమించి విజయం సాధించాలి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించి విజయాన్ని సాధించాలని ఓక్లాండ్ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ప్రముఖ సైకాలజిస్ట్ ఏవి రాజశేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలో ఓక్లాండ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించి పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు అన్నారు. ప్రముఖ మోటివేటర్ డాక్టర్ పాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఒత్తిడి సహజమే అన్నారు. కానీ దాన్ని అధిగమించితే మీకు విజయం తథ్యమన్నారు. ఈ సదస్సులో ఓక్లాండ్ ప్రిన్సిపాల్ సిహెచ్ రవి పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

దేశంలో 78 లక్షల మంది ఇపిఎఫ్ పెన్షన్‌దారులకు దగా చేసిన కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఫిబ్రవరి 11 మంగళవారం విజయనగరం పిఎఫ్ ఆఫీసు వద్ద కనీస పెన్షన్ రూ.9వేలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని ఉచిత వైద్యం, రైల్వే ప్రయాణంలో వృద్ధులకు రాయితీ కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపడుతున్నట్లు ఎపిఅర్‌పిఎ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి శంకర్రావు, ఉపాధ్యక్షులు వి.శేషగిరి, టీబీ అప్పారావు, శంకర్రావు తెలిపారు. ఇపిఎఫ్ పెన్షన్‌దారుల కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అనేక ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నప్పటికీ ఇపిఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9వేలు పెంచడం లేదన్నారు. రాష్ట్రాలలో సామాజిక పెన్షన్ చెల్లిస్తున్నంత కూడా లేదని అన్నారు. జీవితంలో తనవాట, యాజమాన్యాల వాటా లక్షలాది రూపాయలు ఉంచుకొని వెయ్యి రూపాయలు మాత్రమే కనీస పెన్షన్ ఇవ్వడం ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని అన్నారు. బిజెపికి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఉన్న 35వేల మందికిపైగా పెన్షన్ దారులపై కనీసం పార్లమెంట్‌లో మాట్లాడకపోవడం వీళ్ళ చేతగానితనంగా కనిపిస్తోందన్నారు. ఇపిఎఫ్ పెన్సన్ దారులందరూ ఫిబ్రవరి 11 విజయనగరం పిఎఫ్ ఆఫీసు వద్ద జరిగే ధర్నాలో పాల్గొవాలని కోరారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గజపతినగరం

కేన్సర్ వ్యాధి పట్ల అవగాహన ఎంతో అవసరమని వైజాగ్ మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ మృత్యుంజయరావు అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్, విజయనగరం మహేంద్ర హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయిలో కేన్సర్ వ్యాధిని గుర్తిస్తే, ప్రమాద స్థాయి నుంచి బయటపడవచ్చు అన్నారు. దీనిని ఎలా గుర్తించవచ్చు అనే అంశాలపై అవగాహన కల్పించారు. తమ మహాత్మా గాంధీ హాస్పిటల్‌లో కల్పిస్తున్న అత్యాధునిక చికిత్సల గురించి వివరించారు. మహేంద్ర హాస్పటల్ అధినేత మహేంద్రగిరి మాట్లాడుతూ లాప్రోస్కోపిక్, గ్యాస్ట్రో ఎంట్రాలజి సేవలు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఆర్ఎంపిలు, అధ్యక్షులు ఎల్.ఎస్.నాయుడు, వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను రక్షించుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ పాఠశాల విద్యారంగాన్ని, పాఠశాలలను రక్షించుకునే బాధ్యత తల్లితండ్రులు, ఉపాధ్యాయులదేనని, రక్షించుకునే నేపథ్యంలో ఎపిటిఎఫ్ శ్రేణులు, కార్యకర్తలు పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు ఫెడరేషన్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జిఒ 117 ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యారంగాన్ని రూపు రేఖలను మార్చేసి విచిన్నం చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం 117 జిఒ రద్దు చేస్తున్నామని చెప్తూ మరింత విచిన్నం చేసేదిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన 3,4,5 తరగతులను వెనక్కు పంపించి పూర్వ స్థితిని కొనసాగించాలని కోరుతూ 117 జిఒను రద్దు చేయమని కోరామే గాని మోడల్ స్కూల్స్‌గా ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చమని కోరలేదన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 12,500 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని, ప్రస్తుతం మెమో ప్రకారాం మోడెల్ పాఠశాలలు స్థాపిస్తామని చేస్తున్న ప్రయత్నంలో మరిన్ని ఎక్కువ పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా ఏర్పడుతున్నాయని వీటిలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు జోగినాయుడు, ప్రవీణ్ కుమార్, నాగేశ్వర రావు, శ్రీను ఎల్లయ్య, దర్శనం కార్యకర్తలు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణికి ప్రసవం

ప్రజాశక్తి - గజపతినగరం

బాలింతతో వైద్య బృందం

హైరిస్క్ గర్భిణికి ప్రసవం చేసినట్లు స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బి.సతీష్ కుమార్ తెలిపారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో ముర్రే మింగి, ఉమ్మనీరు పోయి, రక్తహీనత కలిగి, బిడ్డ గుండె చప్పుడు తక్కువగా ఉన్న అనంతగిరి మండలం కొండకరం గ్రామానికి చెందిన 14 ఏళ్ల కోటపర్తి విజయ అనే గిరిజన మహిళ భీమవరం పిహెచ్‌సి నుంచి ప్రసవ నొప్పులతో స్థానిక ఏరియా ఆసుపత్రికి వచ్చిందన్నారు. అత్యధిక ప్రమాదం కలిగిన కేస్ అయినప్పటికీ డాక్టర్ అరుణకుమారి అనుభవంతో స్టాఫ్ నర్సులు లక్ష్మి, జ్యోతి సహకారంతో సులభంగా ప్రసవం చేయగలిగామని చెప్పారు. సాధ్యమైనంత వరకు ఎంత కష్టతరమైన కేసులైనా వైద్యం అంది స్తామని లేని పక్షంలో మాత్రమే జిల్లా కేంద్రసుపత్రికి పంపిస్తామని చెప్పారు.

జాతర పనులకు ముహూర్తపు రాట

ప్రజాశక్తి- చీపురుపల్లి

మార్చి రెండో తేదీ నుండి నాలుగో తేదీ వరకు జరగనున్న కనకమహాలక్ష్మి జాతరకు సంబంధించి ఆదివారం స్థానిక కనక మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఇఒ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముహూర్తపు రాటను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ కనకమహాలక్ష్మి 27వ జాతర మహోతసవాలను అంగరంగ వైభవంగా మార్చి రెండవ తేదీ ఆదివారం నుండి మంగళవారం వరకు జరపనున్నామన్నారు. ఈ సందర్భంగా జాతర పనులకు సంబంధించి ముహూర్తపురాటను వేసినట్లు తెలిపారు. ముహూర్తపు రాటతో జాతరకు సంబంధించిన అన్ని పనులను ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా అన్ని ఏర్పాట్లనూ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గవిడి నాగరాజు, రౌతు కాము నాయుడు, లెంక చిన్నారావు, గవిడి వాసుదేవరావు, సూరి కామేశ్వరరావుతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలు

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని హొంజరాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పిఇటిగా పనిచేస్తున్న అదే గ్రామానికి చెందిన బోడ లక్ష్మణరావు రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్‌లో పలు పతకాలు సాధించాడు. ఈ నెల 8,9 తేదీల్లో అనంతపురంలో జరిగిన 43వ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 35 నుంచి 40 సంవత్సరాల కేటగిరీ విభాగంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా తరుపున పాల్గొని జావ్ లేన్‌త్రోలో బ్రాంజ్ మెడల్, హేమర్‌త్రోలో సిల్వర్ మెడల్, డిస్కస్‌త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పతకాలతో లక్ష్మణరావు

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి - వేపాడ


పరుగు పోటీలో తలబడుతున్న ఎడ్ల బండి

మండలంలోని ఆకుల సీతంపేటలో శ్రీవివేకానంద స్వామి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన ఆదివారం జోరుగా సాగింది. ఈ పోటీల్లో 14 ఎడ్ల బళ్ళు పాల్గొని తలబడ్డాయి. విజేతగా నిలిచిన మొదటి ఎడ్ల బండి యజమానికి రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు నగదును సర్పంచ్ కేదారి రమణమ్మ, వైస్ ఎంపిపి అడపా ఈశ్వర రావు, డిసిసిబి మాజీ చైర్మన్ వివి చిన్న రామనాయుడు, మాజీ సర్పంచ్ మంచిని అప్పలసూరి, ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు చేతులు మీదుగా పంపిణీ చేశారు.

కబడ్డీ పోటీల్లో 30 టీమ్‌లు

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో 30 జట్లు పాల్గొని తలబడ్డాయి. మొదటి విజేతగా నిలిచిన జట్టుకు మాజీ సర్పంచ్ మంచిన అప్పల సూరి ఆర్థిక సహాయంతో రూ.10 వేలు నగదు, రెండో బహుమతిగా 8వేలు, మూడో బహుమతిగా 6వేలు నగదును ఉత్సవ కమిటీ చేతుల మీదుగా అందించారు.

ఎల్లారమ్మ జాతరపై రాజకీయ దుమారం

●ఎమ్మెల్యే చర్యలపై అవాక్కయిన తమ్ముళ్లు
● వైసిపికి పెద్దపీట వేస్తున్నారని ఆగ్రహం
●టిడిపిలో గందరగోళం

ప్రజాశక్తి - జామి

ఉత్తరాంధ్ర ప్రసిద్ధి జాతరల్లో ఒకటైన ఎల్లారమ్మ జాతర నిర్వహణపై రాజకీయ దుమారం నెలకొంది. పార్టీ అధికారంలో ఉంటుండగా, ప్రతి పక్ష పార్టీ అయినా వైసిపి నాయకులు పండగ నిర్వహణ చేపట్టడమేంటని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వెనుక స్థానిక ఎమ్మెల్యే కీలక నిర్ణయం దాగి ఉండడం గమనార్హం. ఇదే ఇప్పుడు మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ఇంతకీ తెలుగు తమ్ముళ్లను కలరపెడుతున్న ఆ విషయం ఏంటో తెలియాలంటే... ఈ కథనం పూర్తిగా చివరి వరకు చదవాల్సిందే మరి..

జామి ఎల్లారమ్మ జాతర మూడు రోజులు పాటు ఏటా వైభవంగా జరుగుతోంది. దీనికి దేవాదాయ శాఖతో పాటు పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు ఎంతో సమన్వయంతో పని చేయాల్సి ఉంది. ఒక మాటలో చెప్పాలంటే అధికారంలో ఉన్న స్థానిక శాసన సభ్యులు ఎంతో కీలకంగా వ్యవహరించాల్సిన సందర్భం ఇది. కానీ అదే శాసన సభ్యులు వైసిపి నాయకులకు పండగ బాధ్యత అప్పగించి, టిడిపి నాయకులను సహకరించమని చెప్పినట్లు దుమారం లేస్తుంది. ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడుగా ఉన్న మండల టిడిపి కీలక నేత కూడా ఇటీవల పలువురి వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. జాతర నిర్వహణలో వైసిపి నాయకులతో కలిసి పని చేయాలని స్వయంగా ఆ నాయకుడికే ఎమ్మెల్యే సూచించినట్లు ఆయన అక్కడక్కడ ప్రస్తావించడం గమనార్హం. గత ఎన్నికల్లో వైసిపి నుంచి పోటీ చేసిన కడుబండిని ఓడించేందుకు జామి గ్రామానికి చెందిన వైసిపి కీలక నాయకురాలు టిడిపితో చేతులు కలిపిన విషయం అప్పట్లో చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. అందుకు ప్రతి ఫలంగా జాతర నిర్వహణ బాధ్యత వాళ్ళకి అప్పగించినట్లు సమాచారం. ఈ విషయమే ఇప్పుడు తెలుగు తమ్ముళ్లను గందరగోళానికి గురిచేస్తున్నట్లు సమాచారం. ఈ ఒక్క విషయమే కాదు. ఎమ్మెల్యే ఇటీవల వైసిపి నుంచి వచ్చిన వాళ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తమ్ముళ్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేను బాయ్ కాట్ చేసేందుకు యత్నం

మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కోళ్ల పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల జట్టేటి వలస గ్రామంలో వైసిపి నుంచి వచ్చిన నాయకుడుకు ఎమ్మెల్యే రోడ్డు మంజూరు చేయడంపై టిడిపి నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు ఆ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. అక్కడితో ఆగకుండా మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు కూడా చేసినట్లు సమాచారం. ఇదే కాదు, గ్రామీణ ఉపాధి హామీ నిధులతో చేపట్టే, సిసి రోడ్ల నిర్మాణంలో ఎమ్‌పి శ్రీభరత్, గొంప అనుచరులుగా ఉన్న వారికి తీర్మానాలు కూడా ఇవ్వకుండా ఎమ్మెల్యే అధికారులకు కీలక ఆదేశాలు చేసినట్లు తమ్ముళ్లు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలోకి ఎమ్మెల్యేను రాకుండా బాయ్ కాట్ చేసే ఆలోచనలో మెజారిటీ తెలుగు తమ్ముళ్లు ఉన్నట్లు సమాచారం. ఒక్క జామి మండలమే కాదు.. నియోజకవర్గంలోనే అత్యధిక టిడిపి నాయకుల్లో ఇదే అభిప్రాయం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అధికారులే పండగ నిర్వహించాలి

ఆలయ ఉత్సవ కమిటీ నియామకం జరగలేదు కాబట్టి, అధికారులే పండగ నిర్వహించాలి. కానీ ఉత్సవాన్ని వైసిపి నాయకులతో కలిసి చేయమని ఎమ్మెల్యే సెలవిచ్చినట్లు ఇఒ చెప్పారు. ఇదే జరిగితే నిర్వహణలో జరిగిన అవినీతికి అధికారులే బాధ్యత వహించాలి

- బండారు పెదబాబు, మాజీ జెడ్పిటిసి, జామి.

అసలైన టిడిపి వాళ్ళే ఇక్కడ ప్రతిపక్షం

జామి గ్రామంలో టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీకోసం పాటుపడుతున్న కుటుంబం మాది. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఎంతో కృషి చేస్తూ, వచ్చాం. గత ఎన్నికల్లో ఎమ్‌పి భరత్, గొంప కృష్ణ ఆదేశాలతో కష్టబడి పని చేసి ఎమ్మెల్యేను గెలిపించాం. కానీ మమ్మల్ని ప్రతి పక్షంలాగ చూస్తున్నారు. నిజమైన కార్యకర్తలకు న్యాయం జరగడం లేదు. ఇప్పటికైనా అధిష్టానం ఆలోచించాలి.

- ఇప్పాక వెంకట త్రివేణి, మాజీ సర్పంచ్, జామి.

చెరువు గట్టు తవ్వేసి అక్రమంగా మట్టి తరలించేసి

● సింగవరంలో దౌర్జన్యంగా మట్టి తరలింపు ●పట్టించుకోని సంబంధిత అధికారులు● రాతపూర్వకంగా ఇవ్వాలని చెబుతున్న తహాశీల్దార్

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని సింగవరంలో చెరువు గట్టును తొలగించి మట్టిని అక్రమంగా తరలించకపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయోధ్య చెరువు గట్టును గ్రామానికి చెందిన వ్యక్తి జెసిబిని పెట్టి తవ్వి తొలగించి ఆ మట్టిని అక్రమంగా తన పొలంలో వేసుకుంటున్నాడు. ఇటీవల ఈ మట్టిని ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలో చెరువు గట్టుపై వేయగా ఆయన దర్జాగా ఇప్పుడు కూలీలు వేసిన మట్టితో పాటు గట్టును కూడా దౌర్జన్యంగా తవ్వేసి మట్టిని తరలించేస్తున్నాడు. ఎటువంటి అనుమతులూ లేకుండా ఇష్టానుసారంగా చెరువు గట్టును తవ్వేసి మట్టిని తన సొంతానికి వాడుకున్నారు. ఉపాధి కూలీల ద్వారా చెరువులో ఉన్న మట్టిని రోడ్డు పక్కన గట్టుగా ఏర్పాటు చేస్తే ఆ మట్టిని కూడా అక్రమంగా ఆ వ్యక్తి తొలగించి తరలించుకున్నాడు. తన సొంత భూమిలోనైనా మట్టిని తీసుకువెళ్లాలంటే మైన్స్ పర్మిషన్ తీసుకోవాలి. అలాగే చెరువులో మట్టిని తోలుకోవాలంటే ఇరిగేషన్ అధికారుల పర్మిషన్ తీసుకోవాలి. ఇవేవీ చేయకుండా దౌర్జన్యంగా చెరువు గట్టును, రోడ్డుపై వేసిన మట్టిని అక్రమంగా తరలించకపోయాడు. ఈ విషయం గ్రామస్తులు విఆర్ఒకు, తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే తహాశీల్దార్ విఆర్ఒను పంపించి అక్రమంగా తరలిస్తున్న మట్టిని ఆపారు. ఇలా రెండు మూడు రోజులు గడువిచ్చిన తరువాత మరలా యధావిధిగా ఆ వ్యక్తి దౌర్జన్యంగా మళ్లీ మట్టిని తరలించడం మొదలుపెట్టాడు. ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పని కాబట్టి అక్కడ పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి తరలిస్తున్న మట్టిని నిలుదల చేసి ఎపిఒ, ఎంపిడిఒ, తహాశీల్దార్‌కు చెప్పారు. మట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ప్రజాశక్తి విలేకరి తరలించడానికి అనుమతి ఉందా అని అడిగితే గ్రామ సర్పంచ్ తోలుకోమన్నారని బదులిచ్చాడు. ఈ విషయంపై ఎపిఒను వివరణ కోరగా తమ దృష్టికి క్షేత్ర సహాయకుడు తీసుకొచ్చాడని ఎంపిడిఒ, తహాశీల్దార్‌కు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తహాశీల్దార్ వి.పద్మావతిని వివరణ కోరగా గ్రామస్తులు ఈ విషయంపై రాత పూర్వకంగా కాకుండా ఫోన్ ద్వారా ఫిర్యాదుచ చేశారని వెంటనే విఆర్ఒని పంపించి మట్టి తరలింపును నిలుపుదల చేశామని చెప్పారు. గ్రామస్తులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే దానిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై ఇరిగేషన్ జెఇ విద్యాసాగర్‌ను వివరణ కోరగా తన దృష్టికి ఇప్పటివరకు రాలేదని వచ్చిన తర్వాత పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జెసిబితో తవ్వేసిన చెరువు గట్టు ఇదే..

5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ యు.ఉషారాణి ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. 2025-2026 సంవత్సరాల్లో ప్రవేశాల కోసం మార్చి 6లోపు https://apbragcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి బాలికలకు ఇది ఒక ప్రత్యేక అవకాశం అని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు ఎస్‌సి, ఎస్‌టిలు 2012 సెప్టెంబరు ఒకటో తేదీ, 2016 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన వారే ఉండాలన్నారు. బిసి, ఒసి, బిసిలు 2014 సెప్టెంబర్ 1 నుండి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేవారు 2024-25 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.

'విక్టరీ'లో హిందీ పరీక్ష

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని శ్రీవిక్టరీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఆదివారం హిందీ పరీక్ష నిర్వహించారు. దక్షిణ భారత హిందీ ప్రజాసభ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా తమ పాఠశాలలో హిందీ పరీక్షలు నిర్వహించారని ఈ పరీక్షలు హిందీ భాస నేర్చుకోవడానికి ఉపయోగపడతాయని పాఠశాల అడ్మిన్ రాఘవ్ అన్నారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కొత్తవలస

డీవార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

సోమవారం నుంచి జరగనున్న నేషనల్ డీవార్మింగ్ డేను విజయవంతం చేయా లని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాల కృష్ణ కోరారు. పిహెచ్‌సిలో ఆయన ఆదివారం డీవార్మింగ్ డేకు సంబంధించిన పోస్టర్, కరపత్రా లను విడదుల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు మాత్రలు మింగించాలన్నారు. మండలంలోని 6 ఉన్నత, 4 యుపి, 20 ప్రాథమిక పాఠశాలలతో పాటు 20 అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న 4,250 మంది పిల్లలకు ఈ మాత్రలు మింగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి, హెచ్ఎస్ ఈశ్వం'రావు, ఫార్మసిస్ట్ ఆశ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, పాల్గొన్నారు.

లక్కవరపుకోట: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులు పురుగులు మందులు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని సచివాలయాల పరిధిలో తమ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఈ మందులు అందజేస్తారని చెప్పారు.

రామభద్రపురం: పిహెచ్‌సిల ద్వారా నిర్వహించే నులిపురుగుల నివారణా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి దీలీప్ కుమార్ కోరారు. స్థానిక పిహెచ్‌సిలో ఆదివారం అంగన్‌వాడీ, ఆశా, వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవార్మింగ్ డే సందర్భంగా 2 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఏఎల్టీ శిరీష, మేల్ వర్కర్ ఎన్. వాసుదేవరావు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల ప్రదర్శన

ఘనంగా ఫోర్ట్‌సిటీ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నృత్యం చేస్తున్న విద్యార్థి

ఫోర్ట్‌సిటీ పాఠశాల 13వ వార్షికోత్సవ వేడుకలు రెండో రోజూ ఆదివారం కూడా ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సేవ్ మదర్ ఎర్త్ అనే అంశాన్ని తీసుకొని నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్ల ప్రాముఖ్యత, ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే నష్టాలు, రసాయనాలు వాడటం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, నీటిని దుర్వినియోగం చేస్తే కలిగే ఇబ్బందుల గురించి విద్యార్థులు నాటికలు, నృత్య రూపకాల్లో చాలా చక్కగా వివరించారు. కొత్తగా ఈ సంవత్సరం నిర్వహించిన పానెల్ చర్చ అందరినీ ఆకట్టుకుంది. రామాయణాన్ని నృత్యరూపంలో ప్రదర్శించి అలరించారు. ఉత్తమ ప్రదర్శనలిచ్చిన విద్యార్థులను ఫోర్ట్‌సిటీ పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు, వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రీయినా ఖాన్, మధు, అశోక్, నీలిమా అభినందించారు.

బెల్ట్‌షాపులపై దాడులు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రాజాపులోవలో అనధికార మద్యం దుకాణంపై దాడి చేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. ఈ దాడిలో తొమ్మిది మద్యం సీసాలు లభించాయన్నారు. మద్యం సీసాలతో పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గడిచిన మూడు నెలల్లో అనధికార మద్యం షాపులు నిర్వహిస్తున్న 45 మందిని అరెస్టు చేసి 475 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గూడెపువలసలో ఆదివారం దాడులు చేసి పది సీసాలతో ఒకరిని అరెస్టు చేశామని చెప్పారు.

బొబ్బిలి: మండలంలోని మెట్టవలసలో బెల్ట్ షాపుపై దాడి చేసి ఎనిమిది మద్యం సీసాలతో వ్యాపారిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నం నాయుడు తెలిపారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం దాడి చేసి అరెస్టు చేశామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గజపతినగరం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు, ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఆదివారం చేసిన దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ జె.జనార్ధన్‌రావు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దత్తీరాజేరు మండలం కోమటిపల్లి గ్రామంలో ఇమిడిశెట్టి లక్ష్మణరావు వద్ద నుండి 10 మద్యం సీసాలు, సంతమానాపురంలో కలిశెట్టి రమేష్ వద్ద నుండి 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పి.నరేంద్ర కుమార్, ఎన్.కొండలరావు, డి.గంగాధర్, హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

'పోలీసులు వివక్షత చూపితే ఊరుకోం'

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పోలీసులు వైసిపి నాయకులు, కార్యకర్తలపై వివక్ష చూపితే ఊరుకునేది లేదని వైసిపి మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ జి.రామకృష్ణ, ఎస్ఐ దుర్గాప్రసాద్‌లను మండల వైసిపి నేతలు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు పలు కేసులలో పక్షపాత వైఖిరి చూపించి అధికార పార్టీ నాయకులు పట్ల మొగ్గు చూపారన్నారు. పేరాపురానికి చెందిన వైసిపి కార్యకర్త కోరాడ మహేష్‌పై జనసేన నాయికులు దాడి చేస్తే, ఇరువైపులా కేసులు నమోదు చేస్తామనడం ఎంత వరకు సమంజసమన్నారు. పతివాడ, బర్రిపేట కేసులో కొబ్బరి మొక్కలు ధ్వంసమైన వైసిపి కార్యకర్తలు బర్రి నర్సయ్యమ్మ, పోలిరాజులపై కూడా ఇదే మాదిరిగా కేసు నమోదు చేసారని ఇది మీకు న్యాయంగా ఉందా అని ప్రశ్నించారు. గత కొన్నేళ్లుగా కుటుంబ తగాదాలు వుండటంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసామని సిఐ తెలియచేయడంతో వైసిపి నాయికులు ఎదురు ప్రశ్నించారు. ఎరుకొండ గ్రామంలో జరిగిన వివాదంలో వైసిపి కార్యకర్త పట్ల వివక్ష చూపించారని ప్రశ్నించారు. వాస్తవాలు పరిశీలించి తప్పు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి తప్ప ఏకపక్షంగా కేసులు నమోదు చేయవద్దని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి అల్లాడ రమేష్, నాయకులు మహంతి జనార్ధనరావు, మహంతి శ్రీనివాసురావు, మొంగం నాగబాబు, దాడిశెట్టి త్రినాధరావు, రౌతు సాయికుమార్, పాల్గొన్నారు.

NOTICE
IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE VIZIANAGARAM
EA NO:138/2024 EP NO: 218/2014 OS NO: 53/2014

Between :
Chitrada Neelakanta Rao
.....Petitioner/DHR/Plaintiffs
And:
Nallabati Mohana Rao (died) and 3 others
......Respondents/JDRs/Defendants
To
R2) Nallabati Lakshmi, W/o Late Mohan Rao, R/a Flat No:102, First Floor, D.No: 13-11-14, Om Sai Sakthi Enclave, Gowda Veedhi, Near Kothapeta Mandapam, Vizianagaram Town and District.
R3) Nallabati Mohitha, D/o Late Mohan Rao -Rest- Ditto -
R4) Nallabati Sagar, D/o Late Mohan Rao -Rest- Ditto -

పై నెంబరు పిటిషనులో R2, R3, R4 Respondents/JDRs/Defendants అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీరు తీసుకోవడం లేదు. కావున మీకు ఈ పేపరు పబ్లికేషను ద్వారా నోటీసులు జారీచేయడమైనది. సదరు కేసు తే : 25-02-2025దీన పై కోర్టులో వాయిదా ఉన్నది. కావున **తే 25-02-2025దీన ఉదయం గం॥ 10-30 ని॥ల**కు మీరు కాని లేదా మీ తరుపున వకీలు గారు ద్వారా కాని పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పై కేసు మీ పరోక్షమందు తీర్మానించుదురని ఈ పేపరు పబ్లికేషను ద్వారా మీకు తెలియజేయడమైనది.

A.N.V. ANJANI KUMAR
Advocate,
F-4, Sai Amurutha Castles,
1st Lane Down, Kothagraharam,
Vizianagaram, Cell: 9440123159